ఆంధ్రజ్యోతి ప్రవాస

# ఎంజీఎంఎన్‌టీ ఆధ్వర్యంలో గాంధీ 149వ జయంతి వేడుకలు



**డల్లాస్, టెక్సాస్:** మహాత్మ గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్(ఎంజీఎంఎన్‌టీ) ఆధ్వర్యంలో భారత జాతిపిత మహాత్మగాంధీ 149వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టెక్సాస్‌లోని ఇర్వింగ్‌లో ఉన్న మహాత్మ గాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఐఏఎన్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘గాంధీ పీస్ వాక్’కు విశేష స్పందన లభించింది. అనేకమంది ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. వివిధ వయసుల స్త్రీ, పురుషులు తెలుపు టీషర్ట్స్‌తోపాటు టోపీలు ధరించి ఆకట్టుకున్నారు. పిల్లలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## మరిన్ని ఫొటోల కోసం క్లిక్ చేయండి

విప్రో సీఈవో అబిదాలి నీముచ్వాలాతోపాటు ఆయన భార్య హస్నేనా ముఖ్యఅతిథులుగా కార్యక్రమానికి హాజరయ్యారు. ఇర్వింగ్ సిటీ కౌన్సిల్ మెంబర్ అల్లెన్ మీగెర్, టెక్సాస్ స్టేట్ రిప్రెసెంటేటివ్ మాట్ రినాల్డీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంజీఎంఎన్‌టీ సెక్రటరీ రావు కాల్వల కార్యక్రమానికి హాజరైనవారికి ధన్యవాదాలు తెలిపారు. పీస్ వాక్‌లో భారీ సంఖ్యలో జనం హాజరవడం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఐఏఎన్‌టీ, ఐఏఎఫ్‌సీ, ఎంజీఎంఎన్‌టీ బోర్డు సభ్యులు, అతిథులను ఎంజీఎంఎన్‌టీ కోశాధికారి బీఎన్ సభకు పరిచయం చేశారు. దేశం కోసం జీవితాన్ని త్యాగం చేయడంతో గాంధీని మహాత్మునిగా గౌరవిస్తున్నామని, తరతరాలకు గాంధీ ఆదర్శంగా నిలిచారని ఎంజీఎంఎన్‌టీ కో-చైర్ కమల్ కౌశల్ అన్నారు. కార్యక్రమానికి సహకరించినవారికి, ఇర్వింగ్ నగర ప్రజలకు ఎంజీఎంఎన్‌టీ బోర్డు డైరెక్టర్ కుంతేష్ చోక్సీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసినవారికి మాట్ రినాల్డీను ఆయన పరిచయం చేశారు.

భారత్ నుంచి ఎన్నో వేల కిలోమీటర్ల దూరం వచ్చి గాంధీ జయంతి వేడుకలకు వేలాదిమంది హాజరవడం ఎంతో సంతోషకరమైన విషయమని టెక్సాస్ ప్రజాప్రతినిధి మాట్ రినాల్డీ ప్రశంసించారు. భారత్, అమెరికా మధ్య ప్రజాస్వామ్యం, రక్షణ వంటి సారూప్యతలు ఉన్నాయన్నారు. టెక్సాస్ అభివృద్ధికి కారణమవుతున్న అమెరికా, భారత్ సహకారాన్ని ఆయన అభినందించారు. వరుసగా రెండో ఏడాది ఈ కార్యక్రమానికి హాజరవ్వడం ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నానని ఇర్వింగ్ సిటీ కౌన్సిల్ మెంబర్ అల్లెన్ మేగర్ అన్నారు. ఇర్విన్ నగర ఆర్థిక వృద్ధి కోసం భారతీయ అమెరికన్ల సహకారాన్ని ఆయన ఆకాంక్షించారు.

నార్త్ అమెరికాలో అతిపెద్ద గాంధీ మెమోరియల్‌ను నిర్మించి, నిర్వహిస్తున్న ఎంజీఎంజీటీ చైర్మన్ డా. ప్రసాద్ తోటకూరతోపాటు బృంద సభ్యులను విప్రో సీఈవో అబిదాలి నీముచ్వాలా ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది నాయకులకు ఆదర్శంగా నిలిచిన మహాత్మ గాంధీ అడుగు జాడల్లో నడవడం ఎంతోగౌరవప్రదమైనదని ఆయన కొనియాడారు. మహాత్మగాంధీ పాటించిన సూత్రాలలో కనీసం 10 శాతాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే నివాసానికి ప్రపంచం అత్యంత సురక్షితమైనదని అబిదాలి నీముచ్వాలా అన్నారు. పలు సేవా కార్యక్రమాలకు విప్రో ఆదాయాన్ని దానం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

ఎంజీఎంఎన్‌టీ చైర్మన్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. తామందరం కలిసి మహాత్మ గాంధీ 149వ జయంతి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందకరమన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గాంధీ 150 జయంతి వేడుకల కోసం ఎదురుచూస్తున్నామన్నారు. గాంధీ తన జీవితంలో అధిక భాగం భారత స్వాతంత్ర్య కోసం పోరాటం చేసినప్పటికీ ఆయన సందేశం, సిద్ధాంతాలు ప్రపంచ పౌరుడిగా నిలిపాయని కొనియాడారు. భారతీయ అమెరికన్లుగా తమ బాధ్యత మరింత పెరిగిందని, భారత్‌తోపాటు అమెరికాలోని తమవారి ఎదుగుదల కోసం పాటుపడాలని సూచించారు. తమ స్వరాన్ని గట్టిగా వినిపించేందుకు అర్హత కలిగిన వారు ఓటు వేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఓటు హక్కు కలిగి ఉండాలంటూ అమెరికా పౌరసత్వం ఉండాలని ఆయన గుర్తుచేశారు. అర్హత కలిగినవారు అక్టోబర్ 9లోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి కోసం అందరూ విధిగా సహకరించాలన్నారు. నాలుగు పార్క్ బెంచీలు దానం చేసిన లాంగ్వింటా, సేజ్ ఐటీ, అడిల్ అడి ఫ్యామిలీ అండ్ ఉపేంద్ర ఓర ఫ్యామిలీలకు ప్రసాద్ తోటకూర ధన్యవాదాలు తెలిపారు. బెంచీలను ఆవిష్కరించారు.

ప్రపంచ శాంతికి సూచకంగా ఎంజీఎంఎన్‌టీ అండ్ అతిథులు మొత్తం 10 పావురాలను గాలిలో వదిలేశారు. యోగా టీచర్ విజయ్ నిర్వహించిన వార్మప్ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. అనంతరం పూలతో గాంధీకి నివాళులు అర్పించారు. హాజరైనవారందరికీ అల్పాహారం అందించారు. ఐఏఎన్‌టీ

టీం రాజా బెలాని, అబిజిత్ రైల్‌కర్, జగదీష్ బంకర్, రహూల్ చటర్జీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమవ్వడానికి సహకరించిన బోర్డు సభ్యులు, హర్యానా అసోసియేషన్ వాలంటీర్లు, ఫన్‌ఏషియా, అన్నీ మీడియా, ఇర్వింగ్ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్, అధికారులకు బీఎన్ కృతజ్ఞతలు తెలియజేశారు.